లోపించిన నిర్వహణ!

- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మినీ ఫంక్షన్‌హాల్
- ప్రహరీ గోడ నిర్మించాలంటున్న స్థానికులు



ప్రహరీ గోడ లేని మినీ ఫంక్షన్‌హాల్

మీర్‌పేట: నిర్వహణ లోపించడంతో మినీ ఫంక్షన్ హాళ్లు అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారాయి. ప్రహరీ గోడలు లేకపోవడంతో మందుబాబులకు అడ్డాగా దర్శనమిస్తున్నాయి. మీర్‌పేట కార్పొరేషన్ పరిధి కమలానగర్ కాలనీలో పేద ప్రజల ఉపయోగార్థం కోసం మినీ ఫంక్షన్ హాల్‌ను నిర్మించారు. అయితే ఫంక్షన్‌హాల్‌కు ప్రహరీ నిర్మించకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిపోయిందని స్థానికులు పేర్కొంటున్నారు. రాత్రి 10 దాటితే మందుబాబులు అడ్డాగా చేసుకుని అర్ధరాత్రి వరకు అక్కడే తిష్టవేయడంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానిక బస్తీవాసులు తెలిపారు. దీంతో పాటు ఫంక్షన్‌హాల్‌ను అపరిశుభ్రంగా మారుస్తున్నారని, రాత్రివేళల్లో అటువైపు వెళ్లలేని పరిస్థితి ఏర్పడిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పేద ప్రజల కోసం నిర్మించిన ఫంక్షన్‌హాల్‌కు ప్రహరీగోడ లేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిందని, కార్పొరేషన్ అధికారులు వీలైనంత త్వరగా ప్రహరీ నిర్మిస్తే అడ్డుకట్ట వేయవచ్చని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

చర్యలు తీసుకోవాలి



మినీ ఫంక్షన్‌హాల్ స్థానికులకు ఎంతో ఉపయోగపడుతోంది. కానీ ప్రహరీ లేకపోవడం సమస్యగా మారింది. ప్రహరీ నిర్మించడంతో పాటు పెండింగ్‌లో ఉన్న కిచెన్‌షెడ్, డైనింగ్‌హాల్, మరుగుదొడ్ల నిర్మాణం పనులను వెంటనే ప్రారంభించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– మాధరి సురేఖరమేష్, స్థానిక కార్పొరేటర్



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న నేదునూరు గ్రామస్తులు

అక్రమ వెంచర్‌పై రైతుల ఫిర్యాదు

చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్‌కు మొర

కందుకూరు: ఎలాంటి అనుమతులు లేకుండా వెంచర్ ఏర్పాటు చేయడంతో పాటు కాలువ, రోడ్డును సైతం ఆక్రమించుకొని రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని మండలంలోని నేదునూరు గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డితో పాటు డీపీఓకు శుక్రవారం గ్రామ రైతులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామ రెవెన్యూ సర్వే నంబర్లు 646 నుంచి 648, 651 నుంచి 652, 655లలో 72 ఎకరాల భూమిని విద్యుత్ ఉద్యోగులు సొసైటీగా ఏర్పడి కొనుగోలు చేశారన్నారు. అట్టి భూమిలో ఎలాంటి అనుమతులు లేకుండా విద్యుత్ స్తంభాలు నాటి రోడ్లు వేస్తూ భారీ వెంచర్‌ను ఏర్పాటు చేస్తున్నారన్నారు. దీనికి తోడు చెరువులోకి వర్షం నీరు వెళ్లేలా ఉన్న కాలువతో పాటు పొలాలకు వెళ్లే రోడ్డును కొంత మేర కబ్జా చేశారన్నారు. ఆ విషయంపై పొలం కొన్న ఉద్యోగులకు గ్రామస్తుల మధ్య వాగ్వాదం జరుగుతుందన్నారు. తాము రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులమని మమ్మల్ని ఏమీ చేయలేరంటూ రైతులపైనే దురుసుగా ప్రవర్తిస్తున్నారని వాపోయారు. అధికారులు దర్యాప్తు చేసి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతులు రాకేష్‌గౌడ్, వెంకటయ్య, రవిగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణ నాయక్, మైసయ్య, యాదయ్య, రాములు, డి.రాములు, జంగయ్య, చంద్రయ్య, నాగరాజు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు అంతరాయం

హుడాకాంప్లెక్స్: చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజినల్ ఇంజినీర్ కె.కె.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ లెక్చరర్స్ కాలనీ ఫీడర్ పరిధిలోని కాలనీలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు. 11కేవీ జైన్‌మందిర్, సీతారామాపురం, సిరినగర్, మోర్, సిరీస్, హయత్‌నగర్, పెద్దఅంబర్‌పేట పారిశ్రామిక వాడ, లక్ష్మారెడ్డిపాలెం ఫీడర్ల పరిధిలోని కాలనీలలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు. 11కేవీ శివాలయం, న్యూనాగోల్, శివపురి, గ్రీన్‌హిల్స్, రాజీవ్ స్వగృహ, హుడాసాయినగర్, మదర్ డెయిరీ, గౌరెల్లి ఫీడర్ల పరిధిలోని ప్రాంతాలలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ నిలిపివేయనున్నట్లు తెలిపారు.

పహాడీషరీఫ్ పరిధిలో..

పహాడీషరీఫ్: పహాడీషరీఫ్ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా పలు బస్తీలలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ ఎల్.వి.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. రాజీవ్‌గాంధీనగర్, అబుషేర్ కాలనీ, ముదిరాజ్ కాలనీలలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు.. పహాడీషరీఫ్, ఉమర్ కాలనీ, రంగనాయకుల కాలనీ, దేవేందర్‌నగర్ కాలనీలలో మధ్యాహ్నం 2 నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు అంతరాయం కలగడానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

గురునిలయంలో బుద్ధ పౌర్ణమి



వేడుకలో పాల్గొన్న యోగా గురువులు, విద్యార్థులు

హుడాకాంప్లెక్స్: బుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని హుడాకాంప్లెక్స్ గురు నిలయంలో బాలల వ్యక్తిత్వ వికాస యోగా శిక్షణా తరగతుల విద్యార్థులు శుక్రవారం ఫ్రూట్ కేక్‌ను కట్ చేసి వేడుకలు నిర్వహించారు. అహింసా సిద్ధాంతాన్ని పాటిస్తున్న బౌద్ధులు సృష్టిలోని ప్రతి జీవికి బతికే హక్కు ఉందని, ఏ జీవిని హింసించిన అది మహాపాపమని ప్రపంచానికి బోధించారని గుర్తుచేశారు. కులం, మతం అనే తారతమ్యాలు లేకుండా వసుదైక కుటుంబం ఒకటే జాతి అనే భావనతో జీవించాలని బోధించినట్లు తెలిపారు. వేడుకల్లో ప్రముఖ యోగా గురువు ఇస్మాయిల్, నరేందర్, మహిళా యోగా శిక్షకులు దయాదేవి పాల్గొన్నారు.

అందుబాటులో గన్నీ బ్యాగులు

పీఏసీఎస్ చైర్మన్ డి.చంద్రశేఖర్

కందుకూరు: వరి ధాన్యం కొనుగోలు చేయడానికి అవసరమైన గన్నీ బ్యాగులు ఆరు వేలు అందుబాటులో ఉన్నాయని పీఏసీఎస్ చైర్మన్ డి.చంద్రశేఖర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వరి ధాన్యం క్వింటాళ్లకు ఏ గ్రేడ్ రకానికి రూ.2,203, సాధారణ రకానికి రూ.2,180 చొప్పున కొనుగోలు చేయనున్నామన్నారు. రైతులు వరి ధాన్యంలో తేమ శాతం 17 లోపు ఉండేటట్లుగా, తాలు లేకుండా మండల వ్యవసాయ అధికారుల వద్ద టోకెన్ తీసుకుని ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలన్నారు. సంఘం ద్వారా దీర్ఘకాలిక అప్పులు తీసుకుని కిస్తులు చెల్లించని వారు త్వరగా చెల్లించాలన్నారు. సకాలంలో చెల్లిస్తే అవసరమైనప్పుడు రుణం త్వరగా పొందవచ్చని సూచించారు.

నంబర్ ప్లేటు లేని వాహనాలను సీజ్ చేస్తాం

ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వనాథ్



విరాట్‌నగర్ చౌరస్తాలో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

మీర్‌పేట: నంబర్ ప్లేటు లేని వాహనాలు నడిపితే సీజ్ చేస్తామని మీర్‌పేట పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం.కాశీవిశ్వనాథ్ హెచ్చరించారు. రాచకొండ పోలీసు కమిషనర్ ఆదేశాల మేరకు పోలీస్‌స్టేషన్ పరిధి విరాట్‌నగర్ చౌరస్తాలో శుక్రవారం సాయంత్రం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. వాహనదారులు తప్పనిసరిగా ముందు, వెనకాల నంబర్ ప్లేటు సరిగ్గా ఉండేలా చూసుకోవాలని, నంబర్ ప్లేట్‌ను వంచకూడదని సూచించారు. నిబంధనల మేరకు ప్రతి ఒక్క వాహనదారు నంబర్ ప్లేటుతో తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలని, లేకపోతే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని అన్నారు. దాదాపు 50 వరకు వాహనాలను గుర్తించామని తెలిపారు. తనిఖీల్లో ఎస్‌ఐ గోవిందస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద భాగ్యలక్ష్మి, నాయకులు

కలకత్తా హైకోర్టు తీర్పు అభినందనీయం

బీజేపీ రాష్ట్ర ఓబీసీ కార్యదర్శి ఎం.భాగ్యలక్ష్మి

మీర్‌పేట: ఓబీసీ రిజర్వేషన్ కోటా నుంచి ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేస్తూ కలకత్తా హైకోర్టు తీర్పునివ్వడం అభినందనీయమని బీజేపీ రాష్ట్ర ఓబీసీ కార్యదర్శి ఎం.భాగ్యలక్ష్మి అన్నారు. కోర్టు తీర్పుపై హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం ఆమె మీర్‌పేట జిల్లెలగూడలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి నేటి వరకు ఓబీసీలకు అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఓబీసీల రిజర్వేషన్‌లు 27 శాతం ఉన్నప్పటికీ అందులోనే 4 శాతం రిజర్వేషన్‌లు ముస్లింలకు ఇస్తుందని దీనివల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలలో ఓబీసీలకు నష్టం జరిగిందన్నారు. ఈ తీర్పు తృణముల్ కాంగ్రెస్‌కు చెంపపెట్టని, తెలంగాణలో కూడా మతపరమైన రిజర్వేషన్‌లను రద్దు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు దొబ్బ కుమార్, దళిత కమిటీ అధ్యక్షులు మంగళగిరి శ్వేత, ఓబీసీ ప్రధాన కార్యదర్శి రఘు, పాల్వాయి శ్రీనిధి, ధరణికుమార్ పాల్గొన్నారు.

కలుషిత నీరు సరఫరా కాకుండా చర్యలు

నాగోలు: తాగునీటిలో మురుగు చేరకుండా చర్యలు తీసుకోవాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ అధికారులను కోరారు. డివిజన్ పరిధిలోని న్యూమారుతీ నగర్ కాలనీలో కలుషిత మంచి నీరు సరఫరా అవుతోందని కాలనీ వాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లడంతో శుక్రవారం ఆయన పరిశీలించారు. తాగు నీటిలో డ్రైనేజీ నీరు కలవడంతో కలుషిత నీరు సరఫరా అవుతోందని, వెంటనే నివారణ చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్ అన్నారు. కార్యక్రమంలో కాలనీ వాసులు గోపాల్ యాదవ్, అశ్విన్ సింగ్, తిరుమల్, మహేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



కాలనీవాసులతో మాట్లాడుతున్న పవన్‌కుమార్

మండీలో జేబు దొంగల చేతివాటం

ఖరీదైన ఆపిల్ ఐ ఫోన్ అపహరణ

చంచల్‌గూడ: మాదన్నపేట కూరగాయల మార్కెట్‌లో శుక్రవారం జేబు దొంగలు చేతివాటం ప్రదర్శించారు. కూరగాయలు కొనేందుకు మార్కెట్‌కు వచ్చిన ఓ వ్యక్తికి చెందిన ఖరీదైన ఆపిల్ ఐ ఫోన్‌ను అపహరించారు. వివరాలు...మేడ్చల్‌కు చెందిన నర్సింగ్‌రావు మాదన్నపేట మార్కెట్‌కు వచ్చాడు. పని ముగించుకుని ఇంటికి వెళ్లే సమయంలో అతడి ఆపిల్ ఐ ఫోన్ కనిపించలేదు. అన్ని చోట్ల వెతికినా ఫలితం లేకపోవడంతో తన ఫోన్ చోరీకి గురైందని మాదన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా, మొబైల్ తస్కరించిన వ్యక్తి చార్మినార్ పరిసరాల్లో తిరుగుతున్నట్టు ఫోన్‌లోని టెక్నాలజీ సహాయంతో పోలీసులు గుర్తించారు.

ఆలయ కార్యవర్గం ప్రమాణ స్వీకారం

లింగోజిగూడ: డివిజన్ పరిధిలోని జానకీ ఎన్‌క్లేవ్ కాలనీలోని శివరామ ఆలయం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని శుక్రవారం దేవాలయ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. అధ్యక్షులుగా రమ, ఉపాధ్యక్షుడిగా రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా శంకర్, కోశాధికారిగా గోవర్ధన్, సంయుక్త కార్యదర్శిగా మాధవి ప్రమాణం చేశారు. సలహా సంఘం గౌరవ అధ్యక్షుడిగా స్థానిక కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, సభ్యులుగా లక్ష్మారెడ్డి, ఈశ్వర్, దామోదర్‌రెడ్డి, వెంకటేశ్ ప్రమాణ స్వీకారం చేశారు.



నూతన కార్యవర్గ సభ్యులతో కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి

నకిలీ ఎరువులు విక్రయిస్తే చర్యలు

ఆమనగల్లు: నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయించే దుకాణదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి అరుణకుమారి హెచ్చరించారు. ఆమనగల్లు పట్టణంలోని శ్రీ మహేంద్ర ఫర్టిలైజర్స్, సూర్య అగ్రిషాప్‌ను శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. విత్తనాలు, ఎరువులు, పురుగులమందులకు సంబంధించిన ఇన్‌వాయిస్‌లు, బిల్లులు, రసీదు పుస్తకాలను, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ.. షాపుల యజమానులు స్టాక్ రిజిస్టర్‌ను విధిగా ఎంట్రీ చేయాలని, రైతులకు విక్రయించే వాటికి సంబంధించి రసీదులు ఇవ్వాలని సూచించారు. వ్యవసాయ శాఖ సిబ్బంది, డీలర్లు జంగయ్య, సురేశ్ తదితరులు ఉన్నారు.

అడుగంటిన మమత్‌ఖాన్ చెరువు

సాగు, తాగునీటికి ఇబ్బందులు | **200 బోర్లలో తగ్గిన నీటిమట్టం** | **తాత్కాలిక మరమ్మతులతోనే సరిపెడుతున్న అధికారులు**

తలకొండపల్లి: మండల పరిధిలోని దేవుని పడకల్‌లో యాసంగిలో పంటలను సాగు చేసిన అన్నదాతల పరిస్థితి అగమ్య గోచరంగా తయారయ్యింది. గ్రామంలో దాదాపు 30 ఎకరాల విస్తీర్ణంలో గల మమత్‌ఖాన్ చెరువు ప్రస్తుతానికి పూర్తిగా ఎండిపోయింది. ఈ చెరువు కట్ట తెగి నాలుగు సంవత్సరాలు కావస్తున్నా ఇప్పటికీ శాశ్వత ప్రాతిపదికన కట్ట నిర్మాణం చేపట్టలేదు. ఎప్పటికప్పుడు తాత్కాలిక మరమ్మతులతోనే సరిపెడుతున్నారు. రూ.4 లక్షలతో 'యూ' ఆకారంలో తాత్కాలికంగా బండ్ నిర్మాణం చేపట్టి చేతులు దులుపుకున్నారు. పైగా కట్ట ఎత్తు తగ్గించారు. దీంతో చెరువు నీటి నిల్వ సామర్థ్యం తగ్గడంతో భూగర్భజలాలు అడుగంటాయి.

తూం మూసివేయడంతో..

చెరువులో నీటి నిల్వ సామర్థ్యం పెంచడం కోసం 20 ఏళ్ల క్రితం చెరువు తూం మూయించివేశారు. దీంతో చెరువు నీటినిల్వ సామర్థ్యం పెరిగి అప్పట్లో 80 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందింది. సుమారుగా 300 బోర్లలో నీటిమట్టం పెరిగడంతో పాటు వ్యవసాయ రంగం గణనీయంగా అభివృద్ధి సాధించింది. రైతులు సంవత్సరానికి రెండు పంటలను పండించుకునేవారు. ఈ చెరువుకు పైన ఉన్న వాగులు, కుంటలు, చెరువుల నుంచి వర్షపు నీరు ప్రవహించడానికి పాటు కాలువ ఉండేది.

18 ఎకరాలకు పరిమితం..

ప్రస్తుతం పాటు కాలువ కనుమరుగైంది. చెరువు ఆయకట్టు ప్రస్తుతం 18 ఎకరాలకే పరిమితమైంది. అయితే ఆ 18 ఎకరాలకు కూడా సాగునీరు అందని పరిస్థితి నెలకొంది. చెరువు ఎండిపోవడంతో చుట్టుపక్కల సుమారుగా 220 నుంచి 250 బోర్లల్లో నీటిమట్టం తగ్గింది. ఫలితంగా బోర్లు ఆపి ఆపి పోయడంతో సాగులో ఉన్న వరి, మొక్కజొన్న తదితర పంటలు ఎండిపోయాయి. సుమారుగా 220 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని రైతులు వాపోతున్నారు. వెంటనే నిధులు మంజూరు చేసి శాశ్వత ప్రాతిపాదికన కట్ట మరమ్మతు పనులు చేపట్టడం, పాటు కాలువను పునరుద్ధరించాలని రైతులు కోరుతున్నారు.



అడుగంటిన మమత్‌ఖాన్ చెరువు

పంటలు ఎండిపోతున్నాయి



మమత్‌ఖాన్ చెరువు ఎండిపోవడంతో పరిసర ప్రాంతాల్లో దాదాపు 200 ఎకరాల్లో సాగుచేసిన పంటలు దెబ్బతిని రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. నీరు లేకపోవడంతో పశుపోషణ భారమై పశువులను కబేళాలకు తరలించే పరిస్థితి నెలకొంది. చెరువు కట్ట తెగి నాలుగు సంవత్సరాలవుతున్నా శాశ్వత చర్యలు చేపట్టలేదు. వెంటనే కట్ట నిర్మాణం చేపట్టాలి. – కృష్ణగౌడ్, రైతుసంఘం నాయకుడు, దేవుని పడకల్

రైతుబజార్లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో...) టమోటా లోకల్ 27, వంకాయ 23, బెండ 45, పచ్చిమిర్చి 50, కాకర 35, బీర 35, క్యాలీఫ్లవర్ 18, క్యాబేజీ 17, క్యారెట్ 40. దొండ 31, ఆలు 31, ఉల్లి 24, గోకర 40, దోస 23, సొర 11, పొట్ల 18, అరటి 09, చిక్కుడు 70, అర్వి 40, మునగ 50, చిలగడదుంప 75, బీట్‌రూట్ 19, కీర 18, ఫ్రెంచ్ బీన్స్ 125, కాప్సికమ్ 45. శనివారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే ఈధరలు అమలులో ఉంటాయి.

కాంగ్రెస్ ఘన విజయం సాధిస్తుంది

పార్టీ మలక్‌పేట ఇన్‌ఛార్జ్ షేక్ అక్బర్

మలక్‌పేట: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని, ఆ పార్టీ మలక్‌పేట ఇన్‌ఛార్జ్ షేక్ అక్బర్ అన్నారు. మూసారాంబాగ్ డివిజన్‌లో గురువారం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయన జన్మదినాన్ని ఘనంగా నిర్వహించారు. శాలువాతో అక్బర్‌ను సన్మానించి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరేలా చూడాలని, పార్టీ పటిష్ఠతకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో టీపీసీసీ ఎస్సీ విభాగం రాష్ట్ర కన్వీనర్ భువనగిరి చంద్రశేఖర్, బాబు శ్రీను, ధన్వంత్, అశ్వక్‌ఖాన్, కొమిరెల్లి రాజశేఖరరెడ్డి, గంట్ల కృష్ణ, సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అక్బర్‌ను సన్మానిస్తున్న నాయకులు

మలక్‌పేటలో వాటర్ లాగింగ్ పాయింట్లు 10

- గుర్తించిన అధికారులు
- కార్యాచరణ ప్రణాళిక సిద్ధం
- వరద నిలిచే చోట ముందస్తు జాగ్రత్తలు

చాదర్‌ఘాట్: వర్షా కాలం మొదలవుతుందంటే చాలు మలక్‌పేట లోతట్టు ప్రాంతవాసుల్లో తీవ్ర భయాందోళన వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో ప్రతీ సంవత్సరం మాదిరిగా కాకుండా ఈసారి వానా కాలనికి ముందే మలక్‌పేట జలమండలి అధికారులు వరదనీరు నిలిచిపోయే ప్రాంతాలపై దృష్టి పెట్టి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడమే కాకుండా మ్యాన్‌హోళ్ల వద్ద మరమ్మతులు చేపడుతున్నారు. వాటర్ లాగింగ్ పాయింట్ల వద్ద ప్రమాదాలు జరగకుండా మ్యాన్‌హోళ్లకు మరమ్మతులు చేపడుతున్నారు.

◆ మలక్‌పేట సర్కిల్‌కు వచ్చే ఓల్డ్‌మలక్‌పేట, అక్బర్‌బాగ్, మూసారాంబాగ్, సైదాబాద్ డివిజన్ల పరిధిలో దాదాపు 10 చోట్ల వరదనీరు నిలుస్తున్నదని జలమండలి అధికారులు గుర్తించారు.

◆ మలక్‌పేట సర్కిల్–6 జనరల్ మేనేజర్ షీలా రాణి ఆధ్వర్యంలో సంబంధిత సెక్షన్ మేనేజర్లు, సిబ్బంది గుర్తించిన వాటర్ లాగింగ్ పాయింట్ల వద్ద తనిఖీలు మొదలు పెట్టారు.

◆ డ్రైనేజీ మ్యాన్‌హోళ్ల మూతలు లేని చోట్ల కొత్తవి ఏర్పాటు చేస్తున్నారు. దెబ్బ తిన్న మ్యాన్‌హోళ్లకు మరమ్మతులు చేయిస్తున్నారు. లోతుగా ఉన్న మ్యాన్‌హోళ్ల వద్ద సేఫ్టీ గ్రిల్స్ ఏర్పాటు చేస్తున్నారు.

◆ ఇచ్చట వరదనీరు నిలుస్తుందని పేర్కొంటూ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు.

◆ ప్రజలు కూడా తమ వంతు బాధ్యతగా మురుగు నీటి మ్యాన్‌హోళ్ల లోకి వరదనీరు వెళ్లకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఉందని మేనేజర్ షీలా రాణి గుర్తు చేస్తున్నారు.



ఓల్డ్‌మలక్‌పేటలో వాటర్ లాగింగ్ పాయింట్‌ను పరిశీలిస్తున్న అధికారులు

మ్యాన్‌హోళ్లను తొలగిస్తే క్రిమినల్ చర్యలు



జలమండలి అధికారుల ప్రమేయం లేకుండా మ్యాన్‌హోళ్లను తొలగిస్తే క్రిమినల్ కేసులు పెడతాం. జరిమానాలు కూడా విధిస్తాం. అలాగే ఇళ్లపై కురిసే వర్షం నీరు డ్రైనేజీలోకి వదలకుండా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకొని వాటిలోకి పంపాలన్నారు.

– డీజీఎం షీలారాణి